నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | SURYAPET

కాంగ్రెస్‌లో చలమల్ల చేరిక లొల్లి

- దీప్‌దాస్‌మున్షి సమక్షంలో ఇటీవల చలమల్ల కృష్ణారెడ్డి చేరిక
- చేరికపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి సీరియస్
- చేరిక చెల్లదంటూ డీసీసీ అధ్యక్షుల ప్రకటన
- కాంగ్రెస్‌లోనే ఉన్నానంటున్న చలమల్ల

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా ఇతర పార్టీల్లోని నేతలను పిలిచి మరీ కండువాలు కప్పుతున్న కాంగ్రెస్ పార్టీ పెద్దలకు మునుగోడులో పరిస్థితి భిన్నంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన చలమల్ల కృష్ణారెడ్డి ఆ పార్టీని వీడి మాతృసంస్థ కాంగ్రెస్ కండువా కప్పుకోవడం వివాదాస్పదంగా మారింది. చల్లమల కృష్ణారెడ్డి చేరికను స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఆయన చేరిక చెల్లదని డీసీసీ అధ్యక్షులు ప్రకటనలు చేస్తుంటే తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానంటూ చలమల్ల స్పష్టం చేస్తుండడంతో మునుగోడు కాంగ్రెస్ రాజకీయం రసవత్తంగా మారింది.

మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో చలమల్ల కృష్ణారెడ్డి చేరిక రచ్చకు దారి తీసింది. సంస్థాన్ నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడేనికి చెందిన కాంట్రాక్టర్ చల్లమళ్ల కృష్ణారెడ్డి ఆది నుంచి కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో రాజగోపాల్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సహకారంతో చలమల్ల కృష్ణారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రచారంలోకి వచ్చారు. చివరకు పాల్వాయి స్రవంతిని కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించినా రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు చలమల్ల కృష్ణారెడ్డి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేశారు. ఆ తర్వాత నుంచి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చలమల్ల కృష్ణారెడ్డి తనకే కాంగ్రెస్ టికెట్టు అని బలంగా విశ్వసించారు. తీరా నామినేషన్లకు కొద్దిరోజుల ముందు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తిరిగి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి రావడం, ఆ వెంటనే అభ్యర్థిగా ప్రకటించడంతో చలమల్ల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. దాంతో చివరి నిమిషంలో చలమల్ల కృష్ణారెడ్డి బీజేపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. ఇక తాజా పరిస్థితుల్లో భాగంగా చలమల్ల కృష్ణారెడ్డి బీజేపీని వీడాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్‌లో తనకున్న నెట్‌వర్క్‌తో పాటు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో హస్తం పార్టీలో చేరారు. ఈ నెల 16న గాంధీభవన్‌లో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇది తెలిసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వెంటనే చలమల్ల చేరికపై అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. పార్టీకి ద్రోహం చేసి వెళ్లిన చలమల్ల కృష్ణారెడ్డిని ఎలా చేర్చుకుంటారంటూ పార్టీ పెద్దలను ప్రశ్నించారు. అంతటితో ఆగకుండా నల్లగొండ, యాదాద్రి జిల్లాల డీసీసీ అధ్యక్షులతోనూ ప్రకటనలు చేయించారు. అదే రోజు సాయంత్రం నల్లగొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ స్పందిస్తూ చలమల్ల కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరలేదంటూ.. చేరాలనే ఆసక్తిని మాత్రమే తెలిపారంటూ పేర్కొన్నారు. ఈ నెల 18న యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవ రెడ్డి తీవ్రంగా స్పందిస్తూ చలమల్ల కృష్ణారెడ్డి చేరిక చెల్లదని స్పష్టం చేశారు. 'ఆయన చేరిక చెల్లదు.. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పట్టించుకోవద్దు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే సమయంలో తన స్వలాభం కోసం పార్టీని వీడి బీజేపీలో చేరాడు. తిరిగి ఏ ముఖం పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకొంటాడు. ఆయన బ్లాక్ దందాను కొనసాగించేందుకు, అక్రమ సంపాదనను కాపాడుకునేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాడు' అని ప్రకటన చేశారు. చలమల్ల కృష్ణారెడ్డి కూడా దీనిపై సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ పార్టీ పెద్దలు పిలిస్తేనే గాంధీభవన్‌లో జాయిన్ అయ్యా.. నాకు కాంగ్రెస్ పార్టీ అంటే అభిమానం.. పార్టీ పెద్దలనే కాదూ, రాజగోపాల్‌రెడ్డిని కూడా నేను ఏమీ అనలేదు. ఎంపీ టికెట్ ఇస్తే పోటీకి సిద్ధం.. త్వరలోనే అంతా సెట్ అవుతుందని భావిస్తున్నా. నా చేరిక చెల్లుతుందా.. లేదా అన్నది గాంధీభవన్ పెద్దలు చూసుకుంటారు' అంటూ ఘాటుగానే స్పందించారు. చలమల్ల ఆది నుంచి కాంగ్రెస్‌లో పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి వర్గంగా ముద్ర వేసుకున్నారు. ఆయన అనుమతితోనే తిరిగి కాంగ్రెస్‌లో చేరినట్లుగా చలమల్ల వర్గీయులు పేర్కొంటున్నారు. దాంతో ఓ వైపు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇస్తే, మరోవైపు రాజగోపాల్‌రెడ్డి అడ్డుకుంటుండడం ఆసక్తికరంగా మారింది. ఈ వ్యవహారం రానున్న కాలంలో రాష్ట్ర కాంగ్రెస్‌లో మరిన్ని ఆసక్తికర పరిణామాలకు దారితీయొచ్చన్న చర్చ మొదలైంది.

ఎంజీయూకు నిధుల మంజూరు

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 19 : రాష్ట్ర విశ్వ విద్యాలయ అభివృద్ధి కోసం కేంద్ర పభుత్వ విద్యాశాఖ రూపొందించిన ప్రధాన మంత్రి ఉచ్ఛతర్ శిక్ష అభియాన్ పథకం కింద ఎంజీయూకు రూ. 20 కోట్ల నిధులు మంజూరైనట్లు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా విశ్వ విద్యాలయాలకు రూ.1,296 కోట్లు విడుదల చేయగా అందులో ఎంజీయూకు రూ.20 కోట్లు వచ్చాయని పేర్కొన్నారు. ఈ నిధులను బాలికల హాస్టళ్ల నిర్మాణం, అధునాతన ల్యాబ్స్, విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. విశ్వ విద్యాలయాలు పంపిన అభివృద్ధి ప్రణాళికలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల ఆయన కృతజ్ఞతలు చెప్పారు. ఈ పథకాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ మంగళవారం ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్‌లో యూన్సివర్సిటీలకు వివరాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

హర హర మహాదేవ

చెర్వుగట్టులో భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాలు
పెద్ద సంఖ్యలో పాల్గొని నిప్పుల గుండంలో నడిచిన భక్తులు

చెర్వుగట్టు క్షేత్రంలో స్వామివారి సేవ

చెర్వుగట్టులో అగ్నిగుండాలు తొక్కుతున్న భక్తులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 19 : ఓం నమః శివాయ, శంభో శంకర, హరహర మహా దేవ అంటూ కణకణ మండే నిప్పుల గుండం నుంచి భక్తులు నడిచారు. చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థాన కల్యాణ మండపం ఎదుట సోమవారం తెల్లవారుజామున అగ్ని గుండాల మహోత్సవం భక్తి శ్రద్ధలతో సాగింది. శివ సత్తుల నాట్య విన్యాసాలు, ఆట పాటలతో భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అగ్ని గుండాల నుంచి నడిచేందుకు పోటీపడ్డారు. తెలిసీ తెలియక చేసిన పాపాలు అగ్నితో దహింపజేయాలని వేడుకుంటూ నిప్పుల్లో నడిచారు. పంటలు బాగా పండాలని, కాలం సమృద్ధిగా కావాలని రైతులు తీసుకొచ్చిన ఆముదాలు, పత్తి, కందులు, మినుములు తదితర ధాన్యాలు అగ్ని గుండంలో వేసి పరమ శివుడిని కొలిచారు. అంతకు ముందు పర్వత వాహనంపై ఆసీనులైన పార్వతీ రామలింగేశ్వరులను మంగళవాయిద్యాల నడుమ అగ్ని గుండాల వద్దకు తీసుకొచ్చిన ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ హారతి నివేదించారు. అగ్ని దేవుడికి ఆవాహనం చేసి నిప్పుల గుండం వెలిగించారు. అనంతరం నిప్పులపై నుంచి ప్రధాన అర్చకుడితోపాటు భక్తులు నడిచారు. అగ్ని గుండాల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. దేవాదాయ సహాయక కమిషనర్ మహేంద్ర కుమార్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ నవీన్, ఆలయ సిబ్బంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టారు. అగ్ని గుండాల కార్యక్రమానికి హాజరైన భక్తులు స్వామి వారికి కానుకలు సమర్పించారు. రూ. 60,500 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి తెలిపారు.

నేడు పుష్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి ఏకాంత సేవ, పుష్పోత్సవాన్ని నిర్వహించనున్నారు. స్వామివారికి అష్టోత్తర శత కలశాలతో అభిషేకం, సూర్య నమస్కారాలు, దీక్షా హోమాలు, బలిహరణ, జయాది హోమం, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణం, త్రిశూల స్నానం, వసంతోత్సవం, నీరాజన మంత్ర పుష్పం, క్షేత్ర పాలక అభిషేకాలు జరిపించనున్నారు.

భావితరాలకు స్ఫూర్తి కూరెళ్ల

- గవర్నర్ తమిళిసై సౌందర రాజన్
- వెల్లంకిలో పద్మశ్రీ కూరెళ్ల గ్రంథాలయం ప్రారంభం

కూరెళ్ల గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళిసై

రామన్నపేట, ఫిబ్రవరి19 : కూరెళ్ల సేవలకు రాజ్‌భవనే వెల్లంకి గ్రామానికి వచ్చిందని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామంలో పద్మశ్రీ, మధుర కవి డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య రెండు లక్షల పుస్తకాలతో ఏర్పాటు చేసిన కూరెళ్ల గ్రంథాలయాన్ని, రూ.రెండు కోట్లతో నిర్మించిన నూతన భవనాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. కూరెళ్ల రచించిన విఠలేశ్వర శతకాన్ని ఆవిష్కరించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించారు. కూరెళ్ల కృషి వల్ల వెల్లంకి గ్రామం తెలంగాణ చిత్రపటంలో ప్రముఖ స్థానం పొందిందని ప్రశంసించారు. ఆచార్య కూరెళ్ల విఠలాచార్య ఎంతో సమకూర్చి అమూల్యమైన జ్ఞాన సంపదను భావితరాలకు అందించి ఆదర్శ ప్రాయంగా నిలిచారన్నారు. గ్రంథాలయంలో సమకూర్చిన పుస్తకాలు పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని తెలిపారు. 8.500 పుస్తకాలు, 1000 నోట్ పుస్తకాలతోపాటు రూ. 10,63,070 ప్రొసీడింగ్ కాపీని కూరెళ్లకు గవర్నర్ అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కూరెళ్ల కుటుంబ సభ్యులు గవర్నర్‌కు జ్ఞాపికను అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జి కూనూరు లక్ష్మణ్‌గౌడ్, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెడంగే, పౌరెడ్డి రంగయ్య, ఏనుగు నర్సింహారెడ్డి, ఎస్.రఘు, బెల్లి యాదయ్య పాల్గొన్నారు.

పాతగుట్టలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

- tవైభవంగా తొలి పూజలు ప్రారంభం
- వేద మంత్రాలు, మంగళవాయిద్యాలతో ఆధ్యాత్మిక సందడి

పాతగుట్ట బ్రహ్మోత్సవాలలో స్వస్తివాచనం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 19 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ పాతగుట్ట ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ మూలవర్యులకు నిజాభిషేకం, విశ్వక్సేనారాధన, జల పూజ, పుట్టమట్టిలో నవధాన్యాలు నాటడంతోపాటు స్వస్తి వాచనం వంటి వైదృశ్య కార్యక్రమాలతో సోమవారం బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు, అధికారులు శ్రీకారం చుట్టారు. ఉదయం 10 గంటలకు స్వస్తివాచన ఘట్టాన్ని ప్రారంభించారు. సకల దేవకోటిని ఉత్సవాలకు విచ్చేసి సర్వలోకాలకు క్షేమాన్ని కలిగించమని వేడుకునే కార్యక్రమం పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం జరిపారు. పారాయణికులు మూలమంత్ర, భాగవత, రామాయణ, వేదప్రబంధ పారాయణాలను పఠించారు. 33 కోట్ల దేవతలు, పద్నాలుగు లోకాలు, సమస్త ప్రాణికోటి, చరాచర జగత్తు అంతా భగవానుడి కటాక్షంతో శుభాలు పొందాలని స్వస్తివాచన మంత్రాలతో విశ్వక్సేన ఆరాధనతో ప్రార్థించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాలతో శ్రీవారి ఆలయం ఆధ్యాత్మికతను సంతకరించుకున్నది. ఆలయాన్ని విశేష పుష్పాలతో అలంకరించారు. అర్చకులు స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ఆలయం ముఖ మండపంలో ప్రత్యేక పీఠంపై అధిష్ఠించి పూజలు చేశారు.

రక్షా బంధనం.. పుణ్యాహవాచనం

పాతగుట్ట బ్రహ్మోత్సవంలో శ్రీవారికి, ఉత్సవ నిర్వాహకులకు రక్షాబంధనం గావించారు. ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, పారాయణికులకు అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి దీక్షా వస్త్రాలను అందజేశారు. జగద్రక్షకుడైన పరమాత్ముడిని మూలవరులకు, ఉత్సవమూర్తులకు ఆగమశాస్త్రానుసారం రక్షాబంధన వేడుకలు నిర్వహించారు. అత్యంత పవిత్రమైన ఉత్సవాల్లో కల్యాణ సంబురాలు, స్థల, ద్రవ్య శుద్ధ్యర్థం పూజించిన జలాలతో శుద్ధి పుణ్యాహవాచన కైంకర్యం చేపట్టారు. అర్చకులు ఆలయ పరిసరాలను శుద్ధి చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచామృత కలశాలకు దర్భలతో పూజలు నిర్వహించి పుణ్యజలంగా సంప్రోక్షణ జరిపారు. తిరు వీధుల్లో వేదసూక్త మంత్ర పఠనాలతో తీర్థ ప్రోక్షణ చేశారు.

అంకురారోపణం.. మృత్సంగ్రహణం

పాతగుట్ట బ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంత్రం 6 గంటలకు స్వామి వారి ఆలయంలో అంకురారోపణ, మృత్సంగ్రహణం వేడుకలను ఆగమ శాస్త్ర రీతిలో చేపట్టారు. తొలిపూజలో భాగంగా ఆలయ ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, యాజ్ఞికులు కిరణ్‌కుమారాచార్యులు, ఉప ప్రధానార్చకులు మాధవాచార్యులు, శ్రీధరాచార్యులు, అధ్యాపకులు నల్లన్‌థీఘ్ నీతామనోహరాచార్యులు, పారాయణికులు నర్సింహాచార్యులు, జగన్‌మోహనాచార్యులు, వేణగోపాలాచార్యులు, వేద పండితులు పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణం.. దేవతాహ్వానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ధ్వజారోహణం, వేదపారాయణం, సాయంత్రం 6 గంటలకు భేరీపూజ, దేవతాహ్వానం నిర్వహించనున్నారు.

ఇమాంపేట గురుకులంలో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న మానసిక నిపుణుల కమిటీ సభ్యులు

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలి

- ఇమాంపేట గురుకులాన్ని సందర్శించిన మానసిక నిపుణుల కమిటీ

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 19 : విద్యార్థులకు పాఠాలు బోధించడమే కాకుండా వారి నడవడికను ఉపాధ్యాయులు గమనించాలని సైకాలజిస్ట్‌లు స్రవంతి, అనిల్‌కుమార్ సూచించారు. సూర్యాపేట మండలంలోని ఇమాంపేట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జరుగుతున్న వరుస ఆత్మహత్యల నేపథ్యంలో కలెక్టర్ నియమించిన మానసిక నిపుణుల కమిటీ సభ్యులు సోమవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానసిక పరిస్థితిపై విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచాలని సూచించారు. ఒక్కొక్క విద్యార్థికి ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చి వారిలో మానసిక దృఢత్వాన్ని కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని కోరారు. అలాగే వారికి నాణ్యమైన భోజనం పెట్టడం లేదని పలు మార్లు తమతో చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు. అనంతరం పాఠశాలలోని వసతులు, తరగతి గదులు, భోజన శాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కౌన్సెలింగ్ వారం పాటు కొనసాగుతుందని, ప్రతి విద్యార్థి ప్రవర్తనపై కమిటీ విచారణ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ ఉమామహేశ్వరి, పద్మజ, జ్యోతిపద్మ, అరుణకుమారి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీలత పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- సమీక్షా సమావేశంలో కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, ఫిబ్రవరి 19 : ఈ నెల 28 నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఇంటర్ పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు జరిగే పరీక్షలకు ఆటంకాలు కలుగకుండా నిర్వహించాలన్నారు. జిల్లాలోని 77 కళాశాలల్లో 16,602 మంది విద్యార్థులు ఉండగా, పరీక్షల కోసం 32 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను 9 జోన్లుగా విభజించామని, పరీక్షల నిర్వహణ కోసం ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 3 టీమ్‌ల సిట్టింగ్ స్క్వాడ్స్, 850 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీక్షలో జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఈసీ సభ్యులు లక్ష్మయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

దామరచర్ల: ప్రజాభిప్రాయ సేకరణ సభకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

నేడు యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

దామరచర్ల, ఫిబ్రవరి 19 : యాదాద్రి పవర్‌ప్లాంటులో మంగళవారం నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్లాంటు ఏర్పాటుకు ముందు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఆధ్వర్యంలో టీఎస్ జెన్‌కో అన్ని అనుమతులు తీసుకొని ప్లాంటు నిర్మాణం చేపట్టింది. ప్లాంటులో రెండు యూనిట్లు పూర్తి కావడంతో 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా మిగిలిన మూడు ప్లాంట్లు 80 శాతం వరకు పూర్తయ్యాయి. ఈ క్రమంలో స్వచ్ఛంద సంస్థలకు చెందిన ఇద్దరు ఎన్‌జీటీలో ఫిర్యాదు చేశారు. దాంతో పర్యావరణ అనుమతి కోసం ప్రజాభిప్రాయం చేయాలని ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధం చేశారు. ప్లాంటు వద్ద టెంట్లు వేసి అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నారు ఎలాంటి సంఘటనలు జరుగకుండా ఎస్పీ చందనాదీప్తి ఆధ్వర్యంలో సుమారు 700 మంది పోలీసులను బందోబస్తుకు ఏర్పాటు చేశారు. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభకు జెన్‌కో సీఎండీ రిజ్వీ, కలెక్టర్ హరిచందన, డీఐజీ హాజరుకానున్నారు.

మూసీ కాల్వలకు నీటి విడుదల

కుడి కాల్వలో ప్రవహిస్తున్న నీరు

కేతేపల్లి, ఫిబ్రవరి 19 : మూసీ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వలకు సోమవారం అధికారులు నాలుగో విడుత నీటిని విడుదల చేశారు. 10 రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నారు. ఆయకట్టులో పంటల సాగుకు అవసరమైన విధంగా మరో రెండు తడులు నీటిని వదలనున్నట్లు ప్రాజెక్టు ఏఈ డి.ఉదయ్‌కుమార్ తెలిపారు. రెండు కాల్వలకు కలిపి మొత్తం 313.20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 645(4.46 టీఎంసీలు)అడుగులు కాగా ప్రస్తుతం 633.95(2.00 టీఎంసీలు) అడుగులు ఉన్నది.

ట్రిపుల్ ఆర్‌పై కదలికేది?

- రాయగిరి అలైన్‌మెంట్ మారుస్తామన్న మంత్రి కోమటిరెడ్డి
- ప్రకటించి నెల రోజులైనా ఉలుకుపలుకూ లేదు
- పైగా కోర్టులో స్టేకు వ్యతిరేకంగా ప్రభుత్వం పిటిషన్
- ట్రిపుల్ ఆర్‌పై వేగంగా ముందుకు వెళ్తున్న సర్కారు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : భువనగిరి పరిధిలోని రాయగిరి ట్రిపుల్ ఆర్(రీజినల్ రింగ్ రోడ్డు) అలైన్‌మెంట్ మార్పుపై ఎలాంటి కదలిక లేదు. రైతుల విజ్ఞప్తులు, డిమాండ్ మేరకు మార్పుస్తామన్న ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ ప్రకటనలకే పరిమితమైంది. నెల రోజులైనా దీనిపై ఉలుకుపలుకూ లేదు. ట్రిపుల్ ఆర్‌పై ముఖ్యమంత్రి ముందుకు వెళ్తుంటే.. మంత్రి మాత్రం వెనక్కి అన్నట్టు కాలయాపన చేసే ప్రయత్నం చేస్తున్నారు. కనీసం అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించలేదు. మరోవైపు రాయగిరి రైతులు ఎవరినీ నమ్ముకోకుండా కోర్టులో బలంగా కొట్లాడుతున్నారు.

ట్రిపుల్ ప్రాజెక్ట్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి మెదక్, సిద్దిపేట జిల్లాల మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ వరకు హైదరాబాద్ ఉత్తర భాగం తొలి విడుతలో రీజినల్ రోడ్డు నిర్మించనున్నారు. 159 కిలోమీటర్ల మేర 100 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు అనుగుణంగా చౌటుప్పల్, వలిగొండ, భువనగిరి, యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాల పరిధిలోని 34 రెవెన్యూ గ్రామాల్లో భూసేకరణ చేపట్టనున్నారు. ఇప్పటికే త్రీడీ నోటిఫికేషన్ కూడా జారీ చేశారు.

రాయగిరి రైతులది అరణ్య రోదన

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరి రైతులు ఇప్పటికే పలు దఫాలుగా భూములను కోల్పోయారు. గుట్ట విస్తరణ, హైటెన్షన్ వైర్లు, జాతీయ రహదారి సమయంలో భూములను కోల్పోయారు. ఇప్పుడు మళ్లీ ట్రిపుల్ ఆర్ కోసం భూములు కోల్పోయే ప్రమాదం ఉన్నది.

మంత్రి కోమటిరెడ్డి ప్రకటనలకే పరిమితం..!

మొదటి నుంచి కూడా రాయగిరి పరిధిలో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తూ వస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మార్పిస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుత ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏకంగా నాడు ధర్నాలో పాల్గొన్నారు. గత నెలలో భువనగిరికి వచ్చిన కోమటిరెడ్డి కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారని, అలైన్‌మెంట్ మార్పునకు చర్యలు తీసుకుంటామని, త్వరలోనే మళ్లీ సర్వే చేయిస్తామని ప్రకటించారు. దాదాపు నెల కావస్తున్నా ఇప్పటికీ దీనిపై అడుగు ముందుకు పడలేదు. రాయగిరి ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు అంశంపై మంత్రి కోమటిరెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించకపోవడంపై రైతులు పెదవి విరుస్తున్నారు.

కోర్టులో బలంగా కొట్లాడుతున్న రైతులు

ప్రజా ప్రతినిధులు మాటలకే పరిమితం కావడంతో రైతులు కోర్టులోనే బలంగా కొట్లాడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములను కాపాడుకోవాలని పోరాటం చేస్తున్నారు. దీంతో గతంలో హైకోర్టు రాయగిరి ట్రిపుల్ ఆర్‌పై స్టే ఇచ్చింది. న్యాయస్థానం స్టే ఇచ్చిన కొన్ని రోజులకే ప్రాజెక్టును వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని రేవంత్ రెడ్డి నుంచి ఆదేశాలు రావడంతో ఉన్నతాధికారులు వెంటనే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీరికంటే ముందే ఎన్‌హెచ్ఏఐ కోర్టులో పిటిషన్ వేసింది. దీంతో అప్రమత్తమైన రైతులు వెంటనే కెవియట్ పిటిషన్ వేసి.. స్టేను నిలుపుదల చేయకుండా జాగ్రత్త పడ్డారు.

అధికారులతో మాట్లాడుతున్న విద్యాశాఖ కార్యదర్శి వెంకటేశం

ప్రభుత్వ బడులపై నమ్మకం కల్పించేలా
ఉపాధ్యాయులు కృషి చేయాలి

- విద్యాశాఖ కార్య